

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

ముషీరాబాద్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే ముఠ గోపాల్ అన్నారు. సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగను పురస్కరించుకొని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అహ్మద్ భక్తియార్, ఎండీ మోహిన్ సంయుక్తాధ్వర్యంలో రేడియంట్ స్కూల్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పండగలను ఐక్యంగా జరుపుకుంటూ మత సామరస్యాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్‌చారి, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ ప్రభును సత్కరిస్తున్న డాక్టర్ ఎస్. నిశ్చల తదితరులు

తెలంగాణ భాష ఔన్నత్యం ఎంతో గొప్పది

రాంనగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా ఔన్నత్యం ఎంతో గొప్పదని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.ప్రభు అన్నారు. కళాశాల తెలుగు విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.నిశ్చల ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కె. ప్రభు మాట్లాడుతూ.. తెలంగాణ యాస, ప్రాసలో ఎంతో మాధుర్యం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభును డాక్టర్ ఎస్.నిశ్చల సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల న్యాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జగన్, వాణిజ్య శాస్త్ర సీనియర్ అధ్యాపకుడు కె. అంజనేయులు, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు చందన, సాయి తదితరులు పాల్గొన్నారు.

బొజ్జ తారకం ఆశయ సాధనకు కృషి చేయాలి



బొజ్జ తారకానికి నివాళులర్పిస్తున్న స్కైలాబ్‌బాబు, సాంబయ్య తదితరులు

రాంనగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): లాల్ నీల్ శక్తుల ఐక్యతకు వారధిగా నిలిచిన సామాజిక వేత్త, హైకోర్టు న్యాయవాది దివంగత బొజ్జ తారకం అని కుల నిర్మూలన వ్యతిరేక పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు అన్నారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు జెన్ను సాంబయ్య అధ్యక్షతన బొజ్జ తారకం వర్ధంతి నిర్వహించారు. స్కైలాబ్‌బాబు, దళిత స్త్రీ విముక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. 1990 దశాబ్ధంలోనే కులం, వర్గం అనే చారిత్రాత్మక సిద్ధాంత గ్రంథం రాసిన మహానీయుడు బొజ్జ తారకం అని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు కె. వినయ్‌కుమార్, ఆర్‌పీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు నక్క భిక్షపతి, కార్యదర్శి పి.రమేష్, మహిళా నేతలు రజిత, షాహీద బేగం తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి



నాగరత్నం, అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆకుల రవీందర్‌రావు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఆకుల రవీందర్‌రావు, అధ్యక్షుడు వాయిల శ్రీనివాస్‌రావు సూచించారు. ఇంజనీర్స్ డే సందర్భంగా సోమవారం బర్కత్‌పురలోని సిటిజన్స్ కౌన్సిల్ కార్యాలయంలో ప్రొఫెసర్ మేడిశెట్టి నాగరత్నం, డాక్టర్ అనిల్‌కుమార్, ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పరమేశ్వర్‌రావును సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగరత్నం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా, డాక్టర్ అనిల్‌కుమార్ కమలానెహ్రూ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక ఆనందం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దశరథ్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఆనందాన్నిస్తాయని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం త్యాగరాయగానసభలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోజంతా ఉద్యోగం, బిజినెస్‌తో అలసిపోయేవారికి సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణం ప్రశాంతతను ఇస్తుందన్నారు. దశరథ్‌ను ఇండియా స్వర్ణభారతి అవార్డుతో నిర్వాహకులు సత్కరించారు. నాట్యగురువు వల్లభనేని సజని, బీజేపీ నేత వంశీ, నిర్వాహకుడు జి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సేవా, సంగీత కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు నల్లూరి సుధీర్ కుమార్ అన్నారు. ప్రవీణ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో సినీసంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. పదిహేను సంవత్సరాలుగా ప్రవీణ్ కల్చరల్ అసోసియేషన్ సంస్థ సంగీత, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో గాయకులు గుర్నాప్రసాదరావు, పవన్‌కుమార్, దేవీకృష్ణ, హరి విమల, శ్యామల తదితరులు అక్కినేని, లతామంగేష్కర్ పాటలు పాడారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. యాకత్‌పుర - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం 45 ఏళ్ల వయసు గల వ్యక్తి పట్టాలు దాటుతున్నాడు. వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

ఈనెల 10న ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి (52) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ రెండు కేసులను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మండపాల వద్ద ఆర్టీసీ క్యూఆర్ కోడ్‌తో ఫ్లెక్సీ

రాంనగర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి సంస్థ యాజమాన్యం వినాయక మండపాల వద్ద క్యూఆర్ కోడ్‌తో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. పెళ్ళిళ్లు, ఇతర శుభ కార్యాలకు తక్కువ ఖర్చుతో సేవలను అందిస్తామని ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా ముషీరాబాద్ డిపో మేనేజర్ కిషన్‌రావు మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆర్టీసీ సేవలను తెలుసుకోవచ్చన్నారు.



గణపతి మండపం వద్ద ఆర్టీసీ క్యూఆర్ కోడ్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్‌కుమార్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, మండపాల నిర్వాహకులు సహకరించాలని చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ రమేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందితోపాటు నిమజ్జనానికి బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. నిమజ్జనంలో బందోబస్తులో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్ఐలు అభిలాష్, శశిపాల్‌రెడ్డి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల తరలింపునకు ఏర్పాట్లు



అశోక్, అంబర్‌పేట సీఐ

అంబర్‌పేట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట పీఎస్ పరిధిలో 434 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారని, ఇప్పటి వరకు దాదాపు 250 విగ్రహాలు నిమజ్జనం చేశారని సీఐ అశోక్ చెప్పారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం వినాయక నిమజ్జన ర్యాలీలో 274 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని, వీరిలో డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు కూడా ఉంటారన్నారు. నిమజ్జనానికి తరలించే 12 ఫీట్ల లోపు విగ్రహాలను చే నంబర్ నుంచి, 12 ఫీట్ల కంటే ఎక్కువ ఎత్తున్న విగ్రహాలను అలీకేఫ్, జిందాతిలిస్మాత్, చే నంబర్, శివం రోడ్, శంకర్‌మఠ్ మీదుగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉప్పల్, మలక్‌పేట వైపు నుంచే వచ్చే మరో 700 వినాయక విగ్రహాల తరలింపునకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.



వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న జనార్దన్ రోహన్

వినాయక లడ్డూల వేలం

ముషీరాబాద్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): బాకారంలో మహావీర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను సోమవారం వేలం వేశారు. స్థానికుడు జనార్దన్ రోహన్ రూ. 1.35 లక్షలకు లడ్డూను పాడుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవంతుడి లడ్డూను దక్కించుకోవడం ఆనందంగా ఉందన్నాడు.



లడ్డూను పాడుకున్న అలీ

- పార్శీగుట్టలో జై భారతి హరిజన గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను సోమవారం సాయంత్రం వేలం వేశారు. స్థానిక ముస్లిం యువకుడు అలీ రూ. 16 వేలకు పాడుకున్నాడు.

గోల్నాకలో..



గోల్నాక:వడ్డెర బస్తీ పురన్‌శాంతి శిలా హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో గణేశ్ మండపంలో ఏర్పాటు చేసిన లడ్డూను అపార్ట్‌మెంట్ కమిటీ మెంబర్ డి.శివకుమారి రూ. 75 వేలకు పాడుకున్నారు.

బాగ్‌లింగంపల్లిలో



రాంనగర్: బాగ్‌లింగంపల్లి నైబర్ హుడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిగిరి కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపంలో ఏర్పాటు చేసిన లడ్డూను లింగారెడ్డి రూ. 50 వేలకు పాడుకున్నాడు.



కవాడిగూడ తాళ్లబస్తీలో లడ్డూను రూ. 1.11 లక్షలకు దక్కించుకున్న కాంగ్రెస్ నాయకుడు మేడి సురేష్

పార్వతీపుత్రుడికి కొనసాగుతున్న పూజలు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో మండపాల్లో ఏర్పాటు చేసిన పార్వతీపుత్రుడికి పూజలు కొనసాగుతున్నాయి. సోమారం పదో రోజు వినాయక మండపాల్లో పలు పార్టీల నాయకులు తదితరులు పూజలు నిర్వహించారు. కొన్ని మండపాల్లో లడ్డూలను వేలం వేశారు. మరికొన్ని మండపాల వద్ద అన్నదానం చేశారు.

- ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి)



స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి సామూహిక మంగళ హారతి ఇచ్చిన మహిళలు



బాకారంలో గణనాథుడికి పూజలు చేసిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. అంజిరెడ్డి



శివాలయం చౌరస్తాలో గణేశ్ మండపంలో పూజలు చేసిన బీఆర్ఎస్ నాయకుడు డి. శివముదిరాజ్, మహాకాళి ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు



ముషీరాబాద్‌లో శక్తి యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు చేసిన కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు జెనిగె శ్రీనివాస్ యాదవ్ తదితరులు



భోలక్‌పూర్ మహాత్మానగర్‌లో వినాయకుడికి పూజలు చేసిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్ బిజ్జి కనకేష్‌కుమార్



అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహించిన బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ తదితరులు



బర్కత్‌పురలో బీఎస్ఎస్ బ్రదర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండపంలో పూజలు నిర్వహిస్తున్న సెంట్రల్ పీస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శరత్‌శ్యామ్, ఎస్. రాజీవ్‌రెడ్డి



చిక్కడపల్లిలో వరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండపంలో పూజలు చేసిన తెలంగాణ జువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు కందూరి కృష్ణ



ముషీరాబాద్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్ గౌడ్



రాంనగర్‌లో వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న చైతన్య యూత్ అసోసియేషన్ సభ్యులు



న్యూ పటేల్‌నగర్ వినాయక మండపంలో అన్నదాన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఓ. వెంకటేశ్వర్లు తదితరులు



బాగ్‌లింగంపల్లి సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వద్ద వినాయక నిమజ్జనానికి వెళ్లే విగ్రహాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



అంబర్‌పేట పటేల్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



శంకర్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

పేదలకు అన్నదానం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రుల సందర్భంగా సంఘసేవకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రోహిత్‌కుమార్, లోక్‌సత్తా ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోహిత్ కుమార్ మాట్లాడుతూ.. రెండు వేల మందికి అన్నదానం చేశామని తెలిపారు.

నెలరోజుల్లో 8 బైక్‌ల చోరీ

- **ఇద్దరు నిందితుల అరెస్ట్**

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఎస్ఆర్‌నగర్, బంజారాహిల్స్, మధురానగర్, కాచిగూడ, దోమలగూడ తదితర ప్రాంతాల్లో వరుసగా బైక్ చోరీలు జరుగుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర ఆదేశాలతో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. సాంకేతిక ఆధారాలు సేకరించి నిఘా పెట్టి ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్నారు. వారిని విచారించగా ఇద్దరూ కడప జిల్లాకు చెందిన ధర్మతేజ అలియాస్ సన్ని, గురప్ప అలియాస్ సంపత్‌గా తేలింది. ధర్మతేజ గతంలో కడప, విజయవాడ, హైదరాబాద్‌లలో బైక్ చోరీలకు పాల్పడి జైలుకెళ్లాడు. ఆగస్టు మొదటి వారంలో జైలు నుంచి విడుదలైన సన్ని తన స్నేహితుడు సంపత్‌తో కలిసి హైదరాబాద్‌లో బైక్‌లు చోరీ చేసి, సులభంగా డబ్బులు సంపాదించాలని పథకం వేశాడు, ఇద్దరూ కలిసి ఇటీవల నగరంలో నెల రోజుల వ్యవధిలోనే 8 బైక్‌లు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఆర్ నగర్ పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబర్ 17పై గందరగోళాన్ని సృష్టిస్తున్న పార్టీలు

గోల్నాక, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎం అంబర్‌పేట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బాగ్‌అంబర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో జోన్ కమిటీ సభ్యుడు జి. రాములు అధ్యక్షతన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. మహేందర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17పై చర్చ జరుగుతోందని, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ పోరాటానికి వారసులం మేమంటే మేము అని ప్రచారం చేసుకుంటూ ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయన్నారు. తెలంగాణ పోరాటంలో మచ్చుకైనా కనబడని బీజేపీ వారు నిజాం సర్కార్‌పైన హిందువులు సాధించిన విజయంగా భావిస్తూ దీనిని విమోచన దినంగా జరపాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సభ నిర్వహిస్తున్న తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలైన వారసులు కమ్యూనిస్టులని ప్రజలకు తెలుసని, భూమి, భుక్తి, తెలంగాణ విముక్తి కోసం జరిగిన పోరాటంలో 4వేల మంది ప్రాణాలను కోల్పోయి నిజాం సర్కార్ మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేసిన రోజుగా దీన్ని భావించాలని సూచించారు. సమావేశంలో సీపీఎం అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు సుబ్బారావు, షబానా, సోమయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక నుంచి టెట్రా మద్యం

- **నగరంలో విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు**

పేట్‌బషీరాబాద్ సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా టెట్రా మద్యం ప్యాకెట్లు తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు యత్నిస్తున్న వ్యక్తిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ మహదేవపురంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న భవనం వద్ద శివ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం సేడం జిల్లా నుంచి ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌లో 67 టెట్రా మద్యం ప్యాకెట్లు దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నాడు.

సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పెట్రోల్ బంక్‌లో మహిళపై దాడి

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్‌లో ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితుల నెలకొన్నాయి. పాతబస్తీ ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన విజయ్‌కుమార్, అతడి కుటుంబ సభ్యులు మూడు ద్విచక్ర వాహనాలపై ఖైరతాబాద్‌లో భారీ వినాయకుడిని చూడటానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. విజయ్‌కుమార్ నాంపల్లి చౌరస్తా వద్ద గల పెట్రోల్‌బంక్‌లో తమ వాహనంలో పెట్రోల్ పోయించుకునేందుకు లైన్‌లో నిలబడ్డాడు. అతడి ద్విచక్ర వాహనం హసన్(35) అనే వ్యక్తి వాహనానికి తగిలింది. దీంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో అసభ్య పదజాలంతో దూషించుకున్నారు. అక్కడే నిలబడిన విజయ్‌కుమార్ భార్య.. తన భర్తను ఎందుకు తిడుతున్నావని హసన్‌ను ప్రశ్నించింది. కోపోద్రిక్తుడైన అతడు ఆమెపై దాడి చేశాడు. మహిళ విషయాన్ని బంధువులకు చెప్పడంతో హసన్‌పై దాడి చేయడంతో నాంపల్లి రైల్వేస్టేషన్‌కు పారిపోయి దలదాచుకున్నాడు. రైల్వే పోలీసులు అతడిని ఆబిడ్స్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో సెంట్రల్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే దాడికి పాల్పడిన వ్యక్తి హసన్ మద్యం తాగాడని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

19న అక్కినేని అభిమానుల పండగ

చిక్కడపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): అభినందన సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 19న అక్కినేని అభిమానుల పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఇ. భవాని తెలిపారు. అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎన్నో సాంఘిక సేవా కార్యక్రమాలను నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల అక్కినేని అభిమానులను ఈ సందర్భంగా సత్కరిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362